సామాన్యుల గొంతుక - సకల జనుల వేదిక
# జనగణమన
హైదరాబాద్ 3-5-2026 ఆదివారం | సంపుటి : 1 | సంచిక : 3
Circulated in Telangana & Andhra Pradesh
దినపత్రిక
వెల : రూ.5/- పేజీలు : 08
www.janaganamanadaily.com

## ఏపీలో నలుగురు ఆహార భద్రత ఉద్యోగుల పై వేటు.

**అమరావతి, జనగణమన బ్యూరో**

ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతిలోని ఆహార భద్రత ప్రధాన కార్యాలయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు ఉద్యోగులపై ప్రభుత్వం వేటు వేసింది. సూపరింటెండెంట్ డి. శిరీష, సీనియర్ అసిస్టెంట్లు జి. అఖిల్, సంగీత రావు, జె. సుజాతలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండ్యన్ సస్పెండ్ చేశారు. అనధికారిక సెలవు, ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులో జాప్యం, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోవడం వంటి కారణాలతో ఈ చర్యలు తీసుకున్నారు.



## రేపు తెలంగాణ కేబినెట్ భేటీ!

**జనగణమన బ్యూరో, హైదరాబాద్:**

రేపు తెలంగాణ కేబినెట్ భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం సచివాలయంలో మంత్రి మండలి సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోబోతోంది. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, రైతుల అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఎవరెన్ని అన్నా.. 'రాష్ట్రాన్ని లాలించి అమ్మలా పాలన అందిస్తా'..

### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

**జనగణమన బ్యూరో**
**హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త రాజకీయ శక్తిగా 'తెలంగాణ రక్షణ సేన' ఆవిర్భవించిందని, అన్ని వర్గాల రక్షణే ధ్యేయంగా ఈ వేదిక పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో 'సర్వోదయ తెలంగాణ' లక్ష్యంగా తమ పార్టీ ప్రయాణం సాగుతుందని స్పష్టం చేశారు. శ్రీకృష్ణుడు అధర్మంపై యుద్ధం చేసేందుకు మోగించిన యుద్ధభేరి 'పాంచజన్యం' స్ఫూర్తితో.. ఐదు ప్రధాన అంశాలతో తమ మేనిఫెస్టోను రూపొందించినట్లు కవిత వెల్లడించారు. ఈ ఐదు అంశాలే తమ పార్టీకి ప్రాణవాయువు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో 75 శాతం మంది ప్రైవేట్ విద్యపైనే ఆధారపడుతున్నారని, సామాన్యుడి ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యానికే ఖర్చవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రైవేట్ పాఠశాలల్లో చదివే వారికి కూడా వారు ఎంత వరకు చదువుతారో అంత వరకు పూర్తి ఉచిత విద్యను అందిస్తామని,



దీనికి సంబంధించిన అన్ని ఆర్థిక లెక్కలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎంత ఖర్చైనా వెనకాడబోం..క్యాన్సర్ వంటి మహమ్మారి సోకితే రూ. 3 లక్షలు లేక ప్రాణాలు వదులుకుంటున్న కుటుంబాలు తెలంగాణలో ఉన్నాయని కవిత అన్నారు. లైఫ్ స్పాన్ పెరగాల్సిన సమయంలో సరైన వైద్యం అందకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వచ్చాక ఎంత ఖర్చైనా సరే, ప్రభుత్వమే భరించి ప్రతి బిడ్డకు నాణ్యమైన వైద్యం అందిస్తుందని హామీ ఇచ్చారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు వదులుతున్నారని, మక్కా కుప్పపైనే రైతు చనిపోయిన ఘటన తనను కలచివేసిందని కవిత అన్నారు. **(మిగతా 2లో..)**

## గవర్నర్‌తో నూతన డీజీపీ సీ.వీ ఆనంద్ భేటీ

**జనగణమన బ్యూరో**
**హైదరాబాద్:**



తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన సి.వి.ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టినందుకు సి.వి.ఆనంద్‌ను గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిద్దరి మధ్య కాసేపు అధికారిక చర్చలు జరిగాయి. కాగా డీజీపీగా శివధర్ రెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో నూతన డీజీపీగా సీవీ ఆనంద్ ను ప్రభుత్వం నియమించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఐఈడీ పేలుడు.. ముగ్గురు జవాన్లు మృతి!



**ఛత్తీస్‌గఢ్ :జనగణమన - సెంట్రల్ డెస్క్**

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో శనివారం మధ్యాహ్నం భారీ ఐఈడీ పేలుడు సంభవించింది. జిల్లాలోని ఛోటేబేథియా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాంకేర్-నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగిస్తుండగా ఈ పేలుడు జరిగింది. మందుపాతరలను నిర్వీర్యం చేసే క్రమంలో ఒక్కసారిగా ఐఈడీ పేలుడు సంభవించడంతో ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు తీవ్రంగా గాయపడి.. అక్కడికక్కడే మరణించినట్లు సమాచారం. ఈ పేలుడు ఘటనలో మరొకరికి తీవ్రగాయాలు కావడంతో.. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31న ఛత్తీస్‌గఢ్‌ను మావోయిస్టు ముక్త్ రాష్ట్రంగా ప్రకటించిన తర్వాత జరిగిన మొదటి పేలుడు సంఘటన ఇదే కావడం గమనార్హం.

**కొనసాగుతున్న గాలింపు చర్యలు**

దశాబ్దాల కాలంగా బస్తర్ ప్రాంతంలోని అడవుల్లో నక్సలైట్లు పెద్ద ఎత్తున మందుపాతరలను పాతిపెట్టారు. గత నెలలోనే ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని నక్సల్ రహితంగా ప్రకటించినప్పటికీ, భూమిలో పూడ్చిపెట్టిన ఈ పేలుడు పదార్థాలు భద్రతా బలగాలకు, స్థానిక ప్రజలకు ఇంకా సవాలుగానే మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అటవీ ప్రాంతాల్లో దాగి ఉన్న బాంబులను గుర్తించి, వాటిని నిర్వీర్యం చేసే ప్రక్రియను భద్రతా దళాలు వేగవంతం చేశాయి. ఈ ఘటనపై పోలీసులు లోతైన విచారణ జరుపుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి: పొన్నం




**జనగణమన బ్యూరో ,హైదరాబాద్:**

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, మరణాల సంఖ్య నివారించడానికి ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వినూత్న కార్యక్రమం చేపడుతూ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్‌ను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారులపై రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించే చర్యగా రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలలో ప్రత్యేకంగా కేటాయించిన వేదికలపై ప్రమాదానికి గురైన వాహనాలను హెచ్చరిక సూచికలతో ప్రదర్శించాలని ఆదేశించారు. ఇది డ్రైవర్లకు, ప్రయాణికులకు యాక్సిడెంట్స్ స్పాట్ దగ్గర హెచ్చరికగా పనిచేస్తూ, రహదారి భద్రతపై అవగాహన కల్పించి, ప్రాణాంతక ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. అమూల్యమైన ప్రజల ప్రాణాలను కాపాడటానికి, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని, రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో అటువంటి డిస్‌ప్లేలను ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## జీఎన్ నాయుడు పార్థివ దేహానికి నివాళులర్పించిన చంద్రబాబు

**జనగణమన బ్యూరో, హైదరాబాద్:**



అనారోగ్యంతో కన్నుమూసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, యానాం రీజెన్సీ గ్రూప్ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు పార్థివ దేహానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నివాళులర్పించారు. శనివారం హైదరాబాద్‌లోని నాయుడు నివాసానికి వెళ్లిన వారు ఆయన భౌతికకాయం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా జీఎన్ నాయుడుతో తనకున్న పరిచయాన్ని సీఎం చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. రీజెన్సీ సంస్థల ద్వారా యువతకు ఉపాధి కల్పించడంలోనూ, సమాజ సేవలోనూ ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన మరణంతో తెలుగు ప్రజలు ఒక మంచి పారిశ్రామికవేత్తను కోల్పోయారని ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు.

## భారీగా పెరిగిన వంటనూనె ధరలు

**ఢిల్లీ:జనగణమన - సెంట్రల్ డెస్క్**



భారతీయుల వంట ఇళ్లలో ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ యుద్ధం మంటలు అంటుకుంటున్నాయి. అక్కడి యుద్ధం ఇక్కడ ఎఫెక్ట్ చూపిస్తోంది. ఈ దెబ్బకు వంట నూనెల ధరలు మండిపోతున్నాయి. యుద్ధం సాకుతో కొందరు వ్యాపారులు కృత్రిమ సృష్టిస్తున్నారు. దీంతో నెల రోజుల్లోనే కిలో నూనె ధర ఏకంగా 22 శాతం పెరిగి సామాన్యులకు షాకిస్తోంది. అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా ఓ వైపు రవాణా ఖర్చులు అమాంతం పెరిగిపోగా మరోవైపు గ్యాస్ ధర నిప్పులు కక్కుతున్నాయి. ఇవి చాలవు అన్నట్లు ఇప్పుడు వంట నూనెల ధరలు అదే దారిలో పయణిస్తుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు బతుకీడ్చుడం పెను భారంగా మారుతోంది.

**(మిగతా 2లో..)**

## తమిళనాడులో కింగ్ మేకర్‌గా విజయ్..

### స్వరం మార్చిన స్టాలిన్ మిత్రపక్షం!

**తమిళనాడు:జనగణమన - సెంట్రల్ డెస్క్**



తమిళనాడు రాజకీయాల్లో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి. డీఎంకే నేతృత్వంలోని అధికార కూటమికి షాక్ ఇస్తూ, నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' అనూహ్యమైన ఓట్ల శాతాన్ని సాధించనుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కీలక మిత్రపక్షం నుంచి విజయ్‌పై ప్రశంసలు రావడం చర్చనీయాంశంగా మారింది. డీఎంకే కూటమిలోని ప్రధాన మిత్రపక్షమైన విదుతలై చిరుతైగల్ **(మిగతా 2లో..)**

## హైడ్రా పేదల మీదకు వెళ్తుంది, పెద్దోళ్లను వదిలేస్తుందనడం అవాస్తవం : రంగనాథ్

**జనగణమన బ్యూరో, హైదరాబాద్:**



బతుకమ్మ కుంట చెరువు పునరుద్ధరణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. బతుకమ్మ కుంటలో అసలు చెరువు లేదంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే.. సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ప్రకారం అక్కడ 10 ఎకరాల చెరువు ఉన్నట్లు స్పష్టంగా ఉందని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. వరదల నివారణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు హైకోర్టు తమకు అనుమతి ఇచ్చిందని ఆయన తెలిపారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను పాటిస్తూనే తాము ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను మాత్రమే తొలగిస్తుందని, **(మిగతా 2లో..)**

# డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దాం..

# భావితరాలకు మంచి భవిష్యత్తుని అందిద్దాం

**జిల్లా ఎస్పీ మహేష్ బిగితే ఐపీఎస్**

**ప్రతి విద్యార్థి,యువత యాంటీ డ్రగ్ సోల్జర్ మారాలి**

**ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి**

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా జిల్లా కేంద్రంలో 2కే రన్**





**జనగణమన బ్యూరో**
**రాజన్న సిరిసిల్ల:**

డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు.డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా శనివారం రోజున నిర్వహించిన 2కే రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులతో కలిసి పాల్గొన్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ,డ్రగ్స్,గంజాయి నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి పౌరుడూ బాధ్యతగలవారిగావ్యవహరించి,డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చడంలో భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పక్కా ప్రణాళికతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు , కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతినడంతో పాటు,ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుందని చెప్పారు.అలాగే డ్రగ్స్ వినియోగం శారీరక నష్టాలకే పరిమితం కాకుండా మానసిక సమస్యలు, సామాజిక రుగ్మతలను కూడా పెంచుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి , యువత యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారి మాధక ద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మత్తుపదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో నెంబర్ 8712671111 కి లేదా పోలీస్ వారికిసమాచారం అందించాలని ,సమాచారం ఇచ్చినవారి వివరాలుగోప్యంగాఉంచడం జరుగుతుదన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు పాటించాలి.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో విద్యార్థులకు , వాహన దారులకు , ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతి ద్విచక్ర వాహన దారుడు తమ కోసం తమ కుటుంబ సంక్షేమం కోసం హెల్మెట్ ధరించాలన్నారు. కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని,మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ చేయవద్దన్నారు.మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులతో పాటుగా వాహన యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంజరుగుతుందన్నారు. అనంతరంర్యాలీ కివచ్చిన విద్యార్థులతో, క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేపించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి,సి.ఐ లు శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఎస్.ఐ లు శ్రీకాంత్, డిసిపిఓ కవిత, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, క్రీడాకారులు,యువత, ప్రజలు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎవరెన్ని అన్నా.. 'రాష్ట్రాన్ని లాలించి అమ్మలా పాలన అందిస్తా'..

(మొదటి పేజీ తరువాయి)

ధాన్యం ఎగుమతి చేసేందుకు ప్రత్యేక కమిటీ వేసి రైతులకు మద్దతు ధరతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పిస్తామన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడటం కాదని, ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. 18-45 ఏళ్ల లోపు యువతకు వారి ఐడియాలజీ ఆధారంగా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. మన రాష్ట్రం నుంచి గూగుల్, వాట్సాప్ వంటి సంస్థలు రావాలన్నదే తమ ఆశయమని చెప్పారు. అలాగే, 4 లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

'అమ్మ' లాంటి పాలన..

ప్రస్తుత ప్రభుత్వాలకు అమ్మలా ఆలోచించే విధానం లేదని కవిత విమర్శించారు. సచివాలయంలో వికలాంగులకు ర్యాంప్ లేకపోవడం, బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇవ్వకపోవడం వంటివి ప్రభుత్వ వైఫల్యాలన్నారు. పేదలు, వికలాంగులు, మాజీ మావోయిస్టులు, ఆర్మీ జవాన్లు.. ఇలా అన్ని వర్గాలకు మేలు చేయడమే సామాజిక న్యాయమని, తెలంగాణ రక్షణ సేన అమ్మలా లాలించి పాలన అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా తెలంగాణ సంస్కృతి కోసం పనిచేసిన 'తెలంగాణ జాగృతి' ఒక స్వచ్ఛంద సంస్థగా అలాగే కొనసాగుతుందని, రాజకీయాలకు 'తెలంగాణ రక్షణ సేన' వేదికగా ఉంటుందని ఆమె క్లారిటీ ఇచ్చారు. ఇచ్చిన మాట తప్పని వ్యక్తిగా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సిద్ధమని కవిత తన ప్రసంగాన్ని ముగించారు. 'నేను అమ్మలా పరిణితి చెందుతానని అంటే చాలా మంది ఎలా అవుతారని ప్రశ్నించారు. కానీ అమ్మలాంటి పాలన చేసినప్పుడు మాత్రమే ప్రజలకు న్యాయం చేయగలుగుతాం. కచ్చితంగా ఇప్పుడున్న ప్రభుత్వాలకు అమ్మలా ఆలోచన చేసే విధానం లేదు. నిజామాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు అక్కడకు ఓ వికలాంగుడు వస్తే ఆయనను సర్టిఫికెట్ తేవాలని కలెక్టర్ అడిగిండు. కళ్లముందు వికలాంగుడిగా కనిపిస్తున్న వ్యక్తికి సర్టిఫికెట్ ఎందుకు?. మనం అంత పెద్ద సచివాలయం కడితే ర్యాంప్ లేదు, బాత్ రూమ్ లేదు. ఈ ప్రభుత్వం కనీసం వికలాంగులకు ఫ్రీ బస్ ఎందుకు ఇవ్వటం లేదు. కాంగ్రెస్ పార్టీ దేశంలో వికలాంగులకు కో-ఆప్షన్ మెంబర్ ఇస్తామని ప్రకటించింది. మరి ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కనీసం ఆర్టీసీ బస్సుల్లో కూడా వికలాంగులకు ఉచిత ప్రయాణం ఇవ్వటం లేదు. కచ్చితంగా ఈ ప్రభుత్వంలో అమ్మ లాలనతో పాలన జరగటం లేదు. మేము ఆ దిశగా ప్రయాణం చేస్తాం' అని కీలక వ్యాఖ్యలు చేశారు.

## భారీగా పెరిగిన వంటనూనె ధరలు

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బ మీద దెబ్బ:

కిలో సన్ ఫ్లవర్ ఆయిల్ ధర రూ. 180 నుంచి 200 పెరిగింది. పామాయిల్ ధర రూ. 120 నుంచి రూ. 145, కిలో వేరుశనగ నూనె రూ. 15 నుంచి రూపాయల మేర పెరిగింది. ఇక 5 కిలోల వేరుశనగ నూనె డబ్బా రూ. 1000 నుంచి రూ. 1150 లకు, 15 కిలోల టిన్ను(హోల్?సేల్) రూ.2300 నుంచి రూ.2400 వరకు పెరిగింది. ఇక రైస్ బ్రౌన్ నూనె ధర లీటర్ రూ. 150 నుంచి రూ. 165కు, వనస్పతి ఆయిల్ లీటర్ రూ. 130 నుంచి రూ. 160కి, సోయాబీన్స్ ఆయిల్ రూ. 150 నుంచి రూ. 170కి, ఆవ నూనె రూ.130 నుంచి రూ. 160 కి చేరుకుంది. ఇప్పటికే కమర్షియల్ సిలిండర్ ధరలు భారీగా పెరగడంతో ఓ వైపు బయట హోటళ్లు, రెస్టారెంట్లలో ధరలు పెరుగుతుండగా మరోవైపు వంటనూనెల ధరలు ఆకాశానికి అంటుతుండటంతో సామాన్యుల వంటింటి బడ్జెట్?లో భారీగా మార్పులు వస్తున్నాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగి కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై తనిఖీలు చేపట్టి ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## పెద్ది శంకర్‌కు దాసరి లెజెండరీ ఫిలిం అవార్డు

**జనగణమన బ్యూరో**
**హైదరాబాద్:**



హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో దాసరి లెజెండరీ ఫిలిం అవార్డ్స్ 2026 కార్యక్రమం ఘనంగా జరిగింది ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామ్ సత్యనారాయణ మిత్రబృందం సారథ్యంలో జరిగిన ఈ వేడుకకు సినీ ప్రముఖులు సామాజిక సేవకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను సీనియర్ నటుడు సుమన్ చేతుల మీదుగా 'రెడీ టూ సర్వ్' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పెద్ది శంకర్ కు దాసరి లెజెండరీ ఫిలిం అవార్డు ప్రదానం చేశారు. అనాథలు, వృద్ధులు పేదల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న సేవలను అతిథులు నిర్వాహకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. అవార్డు స్వీకరించిన అనంతరం పెద్ది శంకర్ మాట్లాడుతూ.. తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన నిర్వాహకులు తుమ్మలపల్లి రామ్ సత్యనారాయణకు, అలాగే అవార్డు అందజేసిన దర్శకుడు బోయపాటి శ్రీను నటుడు సుమన్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తన సేవా కార్యక్రమాలకు మరింత ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది ఆ ఇద్దరే: ఎంపీ అర్వింద్

**జనగణమన బ్యూరో , హైదరాబాద్:**



కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఎంపీ మాట్లాడుతూ.. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్టులనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగుతోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## కనుల పండువగా గౌరెల్లి శ్రీ స్వయంభూ లక్ష్మీనృసింహ స్వామి వారి కళ్యాణం

**ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**ఘనంగా గౌరెల్లి శ్రీ స్వయంభూ లక్ష్మీనృసింహ స్వామి వారి 8వ వార్షిక మహోత్సవాలు**

**జనగణమన బ్యూరో**
**అబ్దుల్లాపూర్ మెట్:**



జి.హెచ్.ఎం.సి 51వ డివిజన్ పరిధిలోని గౌరెల్లి గుట్టపై వెలసిన శ్రీ స్వయంభూ స్వర్ణగిరి లక్ష్మీ నృసింహ స్వామి వారి 8వ వార్షిక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించి తరించారు. ఈ పవిత్ర కళ్యాణోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. వారు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వారు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పాడిపంటలతో ప్రాంతం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గౌరెల్లి గుట్టకు ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను వారు కొనియాడారు. ఆలయ అభివృద్ధికి, అలాగే ఇక్కడ జరిగే జాతరకు భవిష్యత్తులో మరింత గుర్తింపు తెచ్చేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఎంతో శ్రమకోర్చి 8వ వార్షికోత్సవాలను, జాతరను ఇంత ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీని మరియు గౌరెల్లి గ్రామ ప్రజలను ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు.అలాగే కళ్యాణానికి విచ్చేసిన భక్తులందరికీ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ (అన్నదానం) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలక మండలి చైర్మన్ నెల్లూరి రాజు, దేవాలయ పాలక మండలి వైస్ చైర్మన్ చెంచల శ్రీనివాస్, సభ్యులు నీరుడు రాజు ముదిరాజ్, చెల్కగారి రాజేష్ గౌడ్, గ్యార దివ్యదాస్, వీరితో పాటు సమస్త గౌరెల్లి గ్రామ ప్రజలు, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చిన్న రావిరాలలో 'ఏకో టౌన్' ఏర్పాటుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం

**ప్రభుత్వం తక్షణమే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే పోరాటం తథ్యం: గ్రామస్తులు**



**జనగణమన బ్యూరో**
**అబ్దుల్లాపూర్మెట్:**

చిన్న రావిరాల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 268లో 494 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఏకో టౌన్' (యూనిట్) ఏర్పాటును వ్యతిరేకిస్తూ చిన్న రావిరాల గ్రామస్తులు ముక్తకంఠంతో గళమెత్తారు. ఏకో టౌన్ ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం గ్రామపంచాయతీ కార్యాలయంలో అత్యవసర గ్రామసభను నిర్వహించారు. సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గ్రామస్తులంతా కలిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలకిషన్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ ఏకో టౌన్ ఏర్పాటు వల్ల గ్రామస్తులు భవిష్యత్తులో ఎదుర్కోబోయే తీవ్ర ఇబ్బందులను, నష్టాలను ప్రజలకు వివరించారు. గ్రామాభివృద్ధికి విఘాతం కలిగించే, ప్రజల మనుగడకు ముప్పు తెచ్చే ఎలాంటి నిర్ణయాన్నైనా పార్టీలకు అతీతంగా అందరం ఏకతాటిపై నిలిచి తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. సర్పంచ్ పిలుపు మేరకు గ్రామ ప్రజలంతా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించారు. ప్రభుత్వం తక్షణమే ఈ ఏకో టౌన్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని, లేనిపక్షంలో గ్రామస్తులందరం ఏకమై ఎలాంటి పోరాటానికైనా సిద్ధమేనని ప్రభుత్వానికి తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఈ అత్యవసర గ్రామసభలో గ్రామ ఉప సర్పంచ్ కవాడి (సద్దిపల్లి) శిరీష శివారెడ్డి, వార్డు సభ్యులు బండారి అనిత, ఆకిటి రామకృష్ణ రెడ్డి, అబ్బావతి బాలయ్య, నారెడ్డి రిషితా సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెరుకు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు మరియు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు హాజరయ్యారు

## హైడ్రా పేదల మీదకు వెళ్తుంది, పెద్దోళ్లను వదిలేస్తుందనడం అవాస్తవం : రంగనాద

(మొదటి పేజీ తరువాయి)

పెద్దవారిని వదిలేస్తుందని వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఈ ప్రచారంలో వాస్తవం లేదని, చట్టప్రకారమే చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. హైడ్రా పేదల మీదకు వెళ్తుంది.. పెద్దోళ్లను వదిలేస్తుందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటి పుకార్లను ప్రజలు నమ్మొద్దని కోరారు. గతంలో హైడ్రా అనేక ప్రాంతాల్లో చెరువులను ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, అపార్టుమెంట్లను కూల్చివేసిన విషయం తెలిసిందే. ఫలితంగా అనేక కుటుంబాలు నిలువనీడ లేకుండా రోడ్డున పడ్డాయి. ఈ క్రమంలో బడా బడా నేతలు, సెలబ్రిటీల జోలికి హైడ్రా వెళ్లబోదని, పేదలపైనే ఉక్కుపాదం మోపుతోందన్న ప్రచారం జోరుగా జరిగింది. ఈ క్రమంలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు.

## తమిళనాడులో కింగ్ మేకర్‌గా విజయ్..

(మొదటి పేజీ తరువాయి)

కట్చి అధినేత తోల్ తిరుమావళవన్, ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై స్పందిస్తూ విజయ్ పార్టీ పనితీరును అభినందించారు. ఎన్నికల బరిలో దిగిన అతి తక్కువ కాలంలోనే టీవీకే పార్టీ ఇంతటి ఆదరణ పొందడం సామాన్యమైన విషయం కాదని ఆయన పేర్కొన్నారు.

ఎగ్జిట్ పోల్స్ షాక్..

తమిళనాడులో జరిగిన ఉప ఎన్నికలు లేదా స్థానిక పోరుకు సంబంధించిన అంచనాల ప్రకారం.. డీఎంకే కూటమి ఓట్ల శాతంలో కోత పడే అవకాశం ఉందని, ఆ ఓట్లు నేరుగా విజయ్ పార్టీ వైపు మళ్లాయని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అధికార కూటమిని ఢీకొంటూ టీవీకే పుంజుకోవడం స్టాలిన్ సర్కారుకు ప్రమాద గంటికలుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కూటమిలో ఉంటూనే తిరుమావళవన్ విజయ్‌ను ప్రశంసించడం డీఎంకే వర్గాల్లో అసహనానికి దారితీస్తోంది. రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల నాటికి కూటమిలో మార్పులు వచ్చే అవకాశం ఉందన్న సంకేతాలను ఈ వ్యాఖ్యలు బలపరుస్తున్నాయి.

జనగణమన
సంపాదకీయం
ఆదివారం 03, మే 2026

# గ్యాస్ బండ బాదుడు

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరను అమాంతంగా 993 రూపాయలు పెంచి జనం మాడు పగలగొట్టింది. ఫిబ్రవరి తరువాత మార్చి ఒకటిన రూ.144, ఏప్రిల్ 1న 200 రూపాయలు పెంచిన సర్కారు ఇప్పుడు ఒకేసారి 993 రూపాయలు పెంచడం అమానుషం. ఢిల్లీలో 2078 రూపాయలు ఉన్న వాణిజ్య సిలిండర్ ధర 3,071 కి పెరిగింది. 48% పెంపు అత్యంత దారుణమైనది. ఈ పెంపుదల వాణిజ్య సిలిండర్ మీదలే మనకేం పరవాలేదు అని ఈ దేశంలో ఏ ఒక్క పౌరుడు అనుకున్నా పప్పులో కాలేసినట్టే! ఈరోజు వాణిజ్య సిలిండర్ ధర పెంచిన ప్రభుత్వం రేపు గృహ వినియోగదారులకు వంట గ్యాస్ ధరను అలాగే పిఎన్‌జి ధరను కూడా పెంచవచ్చు. అంతకుమించి పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి ధరలను మరింతగా పెంచే ప్రమాదం ఉంది. పర్యవసానంగా ప్రయాణాల మొదలు సరుకు రవాణా కూడా భారమవుతుంది. నిత్యావసర సరుకులన్నిటి ధరలు పెరగక తప్పదు. వెరసి నెలకు ఒక్కో కుటుంబానికి వేల రూపాయల అదనపు భారం పడుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దుర్నిర్ణయాల మూలంగా ప్రజాజీవనం అతలాకుతలం అవుతుంది. వాణిజ్య సిలిండర్ ధర పెంపు కొన్ని పారిశ్రామికోత్పత్తుల ధరలు పెరగడానికి దారితీస్తుంది. అంతకుమించి రోడ్డు పక్కన పెట్టుకునే తోపుడు బండ్లు మొదలుకొని బహుళ అంతస్తుల రెస్టారెంట్ల లోనూ తినుబండారాల ధరలు పెరగక తప్పదు. అది రోజువారి కూలి చేసుకునే అసంఘటిత కార్మికులు, చిరుద్యోగాలు చేసుకునే బ్యాచిలర్లు కొంతమంది విద్యార్థులకు పెను భారం అవుతుంది. అందరికీ ఖర్చు పెరుగుతుంది. కనుక వారి ఆదాయాన్ని కూడా పెంచాలి అంటే రోజు కూలి మొదలు నెలవారి వేతనాలను కూడా పెంపుదల చేయాలి. అలా పెంచితే ఉత్పత్తుల ధరలు కూడా పెరిగిపోయి ఆయా సరుకుల ధరలు పెరుగుతాయి. ఖరీదు కావడం వల్ల సరుకులు అమ్ముడుపోని దుస్థితి నెలకొనవచ్చు. పర్యవసానంగా నేడున్న సంక్షోభం మరింత తీవ్రతరం అవుతుంది. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేసిన దాడి మూలంగా చమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నూట పది డాలర్లున్న బేరల్ చమురు ధర శుక్రవారం 126 డాలర్లకు పెరిగింది. ఉద్రిక్తతలు సడలక పోతే చమరుధర బేరల్ 140 కి పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఆ సాకు చూపి దేశీయ పెట్రోల్, డీజిల్ ధరలను కూడా ప్రభుత్వం పెంచుతాను అంటుంది. నిజానికి అంతర్జాతీయ విపణిలో చమురు ధరలు భారీగా పతనమైన సందర్భాల్లో కూడా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను ఒక్క రూపాయి కూడా తగ్గించలేదు. అంతేగాక తన బొక్కసానికి జమయ్యే సుంకాలు, సెస్సులను కూడా ఏ మాత్రం వదులుకోలేదు. ప్రజలపై భారాలు కొనసాగిస్తూనే వచ్చింది. కానీ ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగాయన్న సాకు చూపి పెట్రోల్ డీజిల్ ధరలను పెంచజూస్తోంది. అటువంటి దుశ్చర్యలను యావత్ ప్రజానీకం ప్రతిఘటించక తప్పదు. అటువంటప్పుడు దేశంలో సామాజిక అశాంతి తలెత్తవచ్చు. ఇప్పటికే నోయిడా కార్మికుల ఆందోళన అనుభవం వుంది. అందుకు సంపూర్ణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అవుతుంది. ఇంకొంత బాధ్యత మోడీ ప్రభుత్వం బలపరుస్తున్న అమెరికా, ఇజ్రాయిల్ ప్రభుత్వాలది అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా పెట్రో ఉత్పత్తులపై తాను విధిస్తున్న సుంకాలు సెస్సులను తగ్గించుకోవాలి. వాణిజ్య గ్యాస్ సిలిండర్ పై పెంపుదలను పూర్తిగా ఉపసంహరించుకోవాలి. లేకపోతే బాధిత ప్రజానీకం ఐక్య ఉద్యమాలను పెంపొందించాలి. ఒకటి రెండు చోట్ల అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధంతో అణిచివేయవచ్చునేమోకాని దేశమంతటా ఉద్యమిస్తే పాలకులు నిశ్చేష్టులు కాక తప్పదు. అటువంటి పరిస్థితి సృష్టించడానికి సంసిద్ధం కావడమే మార్గం.

# స్మార్ట్ ఫోన్ కాలంలో కార్మికోద్యమ పాత్ర

మేడే. ఎనిమిది గంటల పనిదినం కోసం జరిగిన పోరాట సంస్మరణగా ప్రపంచ కార్మిక వర్గ అంతర్జాతీయ దినోత్సవం మే 1వ తేదీన జరుగుతుంది. చికాగోలోని హే మార్కెట్ చౌక్‌లో జరిగిన సంఘర్షణలతో అది అజరామరమైంది. 1889లో అంతర్జాతీయ ఫెడరేషన్ దాన్ని నిర్ణయిస్తే ఇప్పుడు ప్రపంచమంతటా కార్మిక హక్కుల సంఘీభావ దినోత్సవంగా వారి హక్కులను చాటే రోజుగా గుర్తించబడింది. ఆ మే 1వ తేదీన చికాగో నగర కార్మికవర్గం భారీ వెల్లువగా కదిలివచ్చారు. నగరంలోని సంఘటిత కార్మికవర ఉద్యమ పిలుపు మేరకు పనిముట్లు పడేసి సమ్మెకు దిగారు. అప్పటికి కార్మికవర్గం అంత పెద్దఎత్తున కదలిరావడం అదే మొదలు. ఆ సమయంలో ఎనిమిది గంటల పనిదినం, ఆ ఉద్యమం సమ్మెకు ఇచ్చిన పిలుపు దాని స్వభావం వీటన్నిటికీ రాజకీయ ప్రాధాన్యత వుంది. హే మార్కెట్‌లో రక్తం పారింది. పార్సన్స్, స్పైస్, ఫిషర్, ఎంగెల్‌లను ఉరి తీయడానికి, ఇతర సమరశీల చికాగో నాయకులను జైళ్లపాలు చేయడానికి దారితీసింది. వారి పోరాటానికి చికాగో అభివృద్ధి నిరోధక యాజమాన్యాల ప్రతీఘాత సమాధానమది. దేశమంతటా యజమానులు దాడి ప్రారంభించాలనే పిలుపు అది. 1885–86 సమ్మె ఉద్యమ కాలంలో పోగొట్టుకున్న తమ ప్రాబల్యాన్ని మళ్లీ స్థాపించుకోవడం కోసం 1886 ద్వితీయార్ధమంతా యాజమాన్యాల దాడులు తీవ్రతరం కావడాన్ని చూసింది. చికాగో కార్మిక నాయకులను ఉరితీత తర్వాత ఏడాదికి 1888లో సెయింట్ లూయిస్‌లో జరిగిన ఫెడరేషన్ సదస్సులో 8 గంటల పనిదినం కోసం పోరాటాన్ని పున:ప్రజ్వలింపజేయాలని నిర్ణయించింది. కార్మికవర్గ సమస్యపై అప్పటికి రెండేళ్లుగా పోరాట సంప్రదాయంగా అమలవుతున్న మే1వ తేదీనే 8 గంటల పనిదినం కోసం మరింత శక్తివంతమైన కార్మికోద్యమం పునరారంభానికి సందర్భంగా తీసుకున్నది. వర్గ సమైక్యత, సంఘీభావం అమెరికా తీరాలను దాటి ప్రపంచమంతటా విస్తరించింది. చరిత్రను తీర్చిదిద్దే ఒక ప్రత్యేక వర్గంగా కార్మికలోకం సమిష్టి ఐక్యానికి అత్యంత శక్తివంతమైన వ్యక్తీకరణగా రూపొందింది.

**మార్క్స్ మాటల నిర్ధారణ**

ఇప్పటి వరకూ వున్న సమాజ చరిత్ర అంతా వర్గ పోరాట చరిత్రేనన్న మార్క్స్ వ్యాఖ్యానం అత్యంత ప్రసిద్ధమైంది. మారిన వర్గ పోరాట పరిస్థితులు, దాని పాఠాలను జీర్ణం చేసుకోవడం ద్వారా అనుభవాలను అంచనా వేసుకోవడానికీ, రానున్న కర్తవ్యాలను నిర్ణయించుకోవడానికి నూతనావకాశం లభించినట్టవుతుంది. ఏ విధంగా చూసినా మేడే ఉత్సవాలు, వాటికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం అన్నవి మార్క్స్ వాదనల సమంజసత్వానికి మహత్తరమైన నిదర్శనాలు. పెట్టుబడి లక్షణాలను గురించి మార్క్స్ చేసిన నిర్దిష్టమైన అధ్యయనం దోపిడీకి వ్యతిరేకంగా, సమాజ మార్పు కోసం పోరాడటానికీ ఒక మార్గ నిర్దేశం ఇస్తూనే వుంటుంది. పెట్టుబడి అనేది ఒకచోట పోగుపడటం, కేంద్రీకరించబడటం సహజసిద్ధమైన లక్షణమని మార్క్స్ అధ్యయనం స్పష్టమైన సంకేతమిచ్చింది.



**పెట్టుబడి నమూనా లక్షణం**

ఏమైనా పెట్టుబడి నమూనా స్వతంత్రమైనదేమీ కాదు. శ్రామికులతో ఘర్షణకు దారితీస్తుంది. కార్మికుల స్పందన ఆ ఉత్పాదక శక్తుల అభివృద్ధికి లోబడి వుంటుంది. కనుకనే కార్మికోద్యమం కూడా ఉత్పత్తి సాధనాలలో నిరంతరాయంగా వచ్చే మార్పులకు సరిపెట్టుకోవలసి వుంటుంది. సాంకేతికతలో పెద్ద ముందంజలు కూడా అందులో భాగంగా వుండేవే. పెట్టుబడి యాజమాన్యం సాంకేతికతలో పురోగమనాన్ని ఉపయోగించుకుని మరింత లాభం కొల్లగొట్టాలనే చూస్తుంటుంది. కార్మికవర్గం ఈ విధంగా దోచుకోవడానికి జరిగే ప్రయత్నానికి తగినట్టు స్పందించవలసి వుంటుంది. ఈ పోరాటం కాలనుగుణంగా సాగుతుంటుంది. జాన్ హెన్రీ అతని వీరోచిత సుత్తి ఆవిరి యంత్రం తొలి రోజులలో కార్మికుల శౌర్య పోరాటాల గాథలను నమోదు చేశాయి. ఇప్పుడు సరికొత్త కృత్రిమ మేధస్సు వచ్చిన కాలం దాకా ఈ పోరాటం కొనసాగుతూనే వున్నది.


**మారిన పరిస్థితుల సవాలు**

ఒక దశాబ్దం క్రితం జాకోబిన్‌లో స్మార్ట్‌ఫోన్ సొసైటీ అనే అద్భుతమైన రచన పనిగంటల పెంపులో స్మార్ట్ ఫోన్‌ల నుంచి ఎదురవుతున్న సవాళ్లను అక్షరీకరించారు. సూర్యాస్తమయం తర్వాత తమ ఈమెయిళ్లను ఆపేయాలని జర్మన్ కార్మికులు ఒక డిమాండ్ ముందుకు తీసుకురాగా కొంతకాలం తర్వాత ఆమోదించబడింది. సమకాలీన పెట్టుబడిదారీ విధానం ప్రస్తుత దశ ఉత్పత్తి శక్తుల బ్రహ్మాండమైన పెరుగుదలకు కారణమైంది. తత్ఫలితంగా పెట్టుబడికీ కార్మికులకు మధ్యన సంబంధం కూడా బాగా పెరిగి దోపిడీ పెరుగుదల వల్ల సవాలు కూడా తీవ్రమైంది, సమకాలీన పెట్టుబడిదారీ విధానం ప్రస్తుత దశలో ద్రవ్యపెట్టుబడి ఇదివరకు లేని దూకుడు ప్రధాన లక్షణంగా వుంటోంది. దానివల్ల అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అనే లక్షణానికి దారితీసింది. దానివల్ల ఉత్తరోత్తరా అది నయా ఉదారవాద ప్రపంచీకరణకు నడిపించింది. అయితే ఈ లక్షణంలోనూ దేశాలవారీ నిర్దిష్టతలతో కూడిన నమూనాలు వచ్చాయనేది నిజమే. అయితే ఈ దశలోనే పెట్టుబడుల కేంద్రీకరణ విపరీత స్థాయికి చేరింది. దీనివల్ల ఇనుమడించిన ఉత్పాదక కార్యకలాపాల పంపిణీ మాత్రం లోపభూయిష్టంగానే వుండిపోయింది. ఈ సమకాలీన వాస్తవం వల్లనే దేశాలలో అంతర్గతంగానూ దేశాలకు వెలుపల కూడా వలసలు అనేవి విపరీతంగా పెరిగాయి. శ్రామికుల ఈ వలసలు అంతర్జాతీయ రాజకీయాలలో ప్రతిబింబిస్తున్నది. అమెరికా–ఇజ్రాయిల్ పాశవిక జాతి హత్యాకాండకు వ్యతిరేకంగా పాలస్తీనియన్ల పట్ల వ్యక్తమైన అపూర్వ సంఘీభావం ఇందుకో గొప్ప ఉదాహరణ. ఈ సంఘీభావం అనేక యూరోపియన్ దేశాలలో ఇజ్రాయిల్ అనుకూల మితవాద రాజకీయవేత్తలను, అమెరికా వత్తాసుదార్లను కూడా కదిలించేసింది.

**భారత దేశంలో...**

భారత దేశంలోనైతే రాజకీయ దృశ్యంలో వచ్చిన పెను మార్పు కార్మికోద్యమంపై ప్రభావం చూపిస్తున్నది. ఈ నయా ఉదారవాద విధానాల వల్ల వచ్చిన దూకుడు, మోడీ ప్రభుత్వ నాయకత్వంలోని కార్పొరేట్ మతతత్వ కూటమి పచ్చి మతతత్వ సమీకరణకు పాల్పడుతున్నది. ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీసి, నిరంకుశ ఫాసిస్టు పాలనను బలోపేతం చేస్తున్నది. దీంతోపాటే సామాజిక ఆర్థిక అసమానతల పెరుగుదల, నిరుద్యోగం విజృంభణ కూడా ఈ కాలంలోనే సంభవిస్తున్నది. దీనివల్ల మన కార్మికవర్గ సారానికే ముప్పు కలుగుతున్నది..నయా ఫాసిస్టు పాలన లక్షణాలు అది తెచ్చిన నూతన లేబర్ కోడ్లలో వ్యక్తమవుతున్నది. వాటిని గత ఏడాది తీర్చి దిద్దినప్పటికీ నూతన ఆర్థిక సంవత్సరంతోనే అవి అమలుకు తీసుకొచ్చారు. పెట్టుబడి నూతన లక్షణాలలో భాగంగా కార్మికులు, అసంఘటిత రంగం, యథాలప పని అప్పగింత వంటివి బాగా వేగం పుంజుకుంటాయి. సరైన నిజవేతనం కోల్పోవడం కార్మికులను గోడకేసి నిలబెట్టినట్టు కనిపిస్తుంది. ఈ ఏడాది మేడే పూర్వ రంగం చూస్తే ఇప్పటికి హర్యానా, నోయిడా, రాజస్థాన్, ఉత్తరాఖండ్ లోని ఉద్దం సింగ్ నగర్, పంజాబ్ లోని భటిండా వంటి చోట్ల అనేక ఆకస్మిక శ్రామికవర్గ కార్యాచరణలు కనిపిస్తాయి. సరే ఈ ఏడాది మేడే నిర్వహించడమంటే... నిశ్శబ్దం భంగం కావడానికి దోహదం చేసే నిర్దిష్ట చర్యలను అధ్యయనం చేయవలసి వుంటుంది. కార్మికోద్యమం నిర్వహించవలసిన పాత్ర ఏమంటే... చెల్లాచెదురుగా సాగుతున్న ఈ కార్యాచరణలను కలగలిపి ఒక్క తాటి పైకి తేవడం. ఒక శక్తివంతమైన సమైక్య ఉద్యమంగా నడిపించడం. ఆ విధంగా కార్మిక కోడ్‌లను వెనక్కు కొట్టవలసి వుంటుంది. ఆ విధమైన శ్రామిక వర్గ రాజకీయ క్రియాశీలతే ఉత్తరోత్తరా నయా ఫాసిస్టు దురాక్రమణ సవాలను స్వీకరించవలసి వుంటుంది.

# అలరిస్తున్న 'హారీ పోటర్' రచనలు




ప్రపంచ సాహిత్య చరిత్రలో "హారీ పోటర్" నవలలు సృష్టించిన ప్రభంజనం అద్భుతం, ఆశ్చర్యకరం. హారీ పోటర్ శ్రేణిలో వచ్చిన ఏడు నవలలు ఆబాలగోపాలాన్ని ఒప్పించి మెప్పు పొందడం గొప్ప విషయం. ప్రజాదరణను దృష్టిలో పెట్టుకుని 2012లో యు.కె ప్రధాన మంత్రి డెవిడ్ కామరూన్ చొరవతో...జె. కె. రౌలింగ్ రచించిన హారీ పోటర్ నవలా శ్రేణి పుస్తకాలకు మరింత గౌరవం, ప్రచారం కల్పించడానికి...ప్రతి ఏటా మే 2న "అంతర్జాతీయ హారీ పోటర్ దినోత్సవం (ఇంటర్నేషనల్ హారీ పోటర్ డే)" పాటించడం ప్రారంభమైంది. 1997తో మొదలు 2007 వరకు వరుసగా ఏడు సీరియల్ ఫాంటసీ నవలలు మార్కెట్లోకి రావడం, క్షణాల్లో లక్షల కాపీలు అమ్ముడు పోవడం చకచకా జరిగిపోయాయి. హారీ పోటర్ నవలల ప్రభంజనం నేటికీ తగ్గలేదంటేనే ఆ సాహిత్య మహిమ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. హారీ పోటర్ నవలలు ఏకంగా 600 మిలియన్ల వరకు అమ్ముడుపోవడం వల్ల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించి చరిత్ర సృష్టించింది.

**అంతర్జాతీయ హారీ పోటర్ దినోత్సవం**

1998 మే 2న జరిగిన "బ్యాటిల్ ఆఫ్ హోగార్ట్స్"కు నివాళిగా ఈ రోజును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ నవలల్లోని పాత్రలకు అనుగుణంగా వేషాలు వేయడం, సంబరాలు చేసుకోవడం, హారీ పోటర్ పుస్తకాలు మరోసారి చదవడం, హారీ పోటర్ సినిమాలను చూడడం, పుస్తక దుకాణాలు/గ్రంథాలయాలు/అభిమాన సంఘాలు హారీ పోటర్ ఆధారిత పోటీలను నిర్వహించడం జరుగుతున్నది. హారీ పోటర్ కల్పిత కథలోని పాత్రలను గుర్తు చేసుకుంటూ మరథాన్‌లు నిర్వహించడం వరకు తమ అభిమానాన్ని, ప్రేమను వ్యక్తం చేయడం నేటికీ కొనసాగుతున్నది.

రచయిత్రి

**జె. కె. రౌలింగ్ సాహిత్య సృజన**

రచయిత్రి జొవాన్నె రౌలింగ్ సాధారణ కలం పేరు జె. కె. రౌలింగ్. ఆమె ఒక గొప్ప సాహితీవేత్తగానే కాకుండా దాతృత్వం కలిగిన ప్రఖ్యాత కల్పిత కథా రచయిత్రి. 1997లో "హారీ పోటర్ అండ్ ది ఫిలాసఫర్స్ స్టోన్" పేరుతో తొలి ఫాంటసీ నవల విడుదల కావడం, ప్రభంజనం సృష్టించడం, దాని తర్వాత వరుసగా మరో ఆరు సీరియల్ నవలలు విడుదల కావడం, 2007లో చివరి హారీ పోటర్ నవల "హారీ పోటర్ అండ్ ది డెడ్లీ హాల్లోస్" విడుదల కావడం, ఈ మొత్తం ఏడు నవలలు అత్యధికంగా అమ్ముడుపోవడం సాహితీరంగంలో ఒక అద్భుతం. హారీ పోటర్ శ్రేణి ఊహాత్మక కథల పుస్తకాలతో పాటు డ్రామా, యువతకు సంబంధించిన కట్టుకథలు, నేర కల్పిత కథలు వంటివి రాసిన రౌలింగ్ నేటికీ తన రచనలతో సాహితీ అభిమానుల మనసులు గెలుచుకుంటున్నది.

చెడుపై మంచి, చీకటిపై వెలుగుల విజయానికి, న్యాయ పోరాటానికి సూచికగా నిలుస్తున్న హారీ పోటర్ కల్పిత కథతో కూడిన నవలలు నేటికీ పౌర సమాజం అభిమానాన్ని పొందుతున్నాయి. విద్య విజ్ఞాన సంపన్న హీరోలు అన్ని అడ్డంకులను ఛేదించుకుంటూ విజయ తీరాలకు చేరతారనే నమ్మకాన్ని అనుభూతి పొందడం ఆశ్చర్యకరం, అభినందనీయం.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

## మంత్రి పొంగులేటి రాకతో చిన్న బండి రేవ్ గ్రామం పావనం

## అభివృద్ధి పథంలో బడా నాయకులు..





**జనగణమన బ్యూరో ,దుమ్ముగూడెం,**

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎస్పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎవరెస్టు శిఖరంపై రాహుల్ ముద్ర.!

## పీఓ పై గిరిజన యువకుడి అచంచల అభిమానం..




**జనగణమన బ్యూరో భద్రాచలం**

భద్రాచలం ఐటీడీఏ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం. ఒక అధికారి పట్ల ప్రజలకు ఉండే కృతజ్ఞత సరిహద్దులు దాటి, సముద్ర మట్టానికి వేల మీటర్ల ఎత్తున ఉన్న ప్రపంచ శిఖరాగ్రానికి చేరుకుంది. సాహస యాత్ర విశేషాలు..ఎనుబల్లి మండలం వి.ఎం బంజర్ గ్రామానికి చెందిన బి. మోతీ కుమార్ అనే గిరిజన యువకుడు గతంలో మౌంట్ కిలి మంజరో పర్వతం 5 8 9 5 మీటర్లు, మౌంట్ ఎల్బ్రస్ పర్వతం 5642 మీటర్లు అధిరోహించి రావడం జరిగిందని, ప్రస్తుతం ఎవరెస్ట్ శిఖరం సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న బేస్ క్యాంప్‌కు వరకు వెళ్లి వచ్చాడు, త్వరలో ఎవరెస్ట శిఖరాన్ని అధిరోహించబోతున్నాడు. దీనికి అతను, దాతల సహకారం కోరుతున్నాడు. హిమ శిఖరాల నుండి వీడియో సందేశం...మోతీ కుమార్ ఎవరెస్ట్ మంచు కొండల నుండి పంపిన సందేశం ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది."సార్, గిరిజనుల సంక్షేమం కోసం మీరు పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా, మీపై ఉన్న అభిమానంతో ఈ ఫ్లెక్సీని తీసుకొని వచ్చాను ధన్యవాదాలు అని ఆ యువకుడు సందేశం పంపించడం జరిగింది. ఒక ఐఏఎస్ అధికారి పట్ల గిరిజన యువతకు ఉన్న ఈ అచంచలమైన ప్రేమాభిమానాలు, ప్రజా సేవకు పారదర్శకమైన పాలన తోడైతే ఎలాంటి ఫలితాలు ఉంటాయో అనడానికి నిదర్శనం, ప్రజల నుండి ఏ అధికారికైనా అభిమానంతో కూడిన గౌరవం లభించడం మనం చూస్తుంటాం కానీ గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఐటీడీఏ పీవో బి రాహుల్ కి దేశంలోనే మొట్టమొదటిసారి ఇంతటి అరుదైన గౌరవం దక్కడం విశేషం.

పీ ఓ రాహుల్ స్వర్ణ యుగం. గిరిజన ప్రాంత అభివృద్ధిలో పీఓ రాహుల్ రెండేళ్ల లోపు పాలన ఒక అద్భుతమైన మార్పును తెచ్చింది. గిరిజన సంస్కృతిని భద్రపరిచేందుకు అత్యాధునిక గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయటం, గిరిజన ఉత్పత్తుల కోసం 'భద్రగిరి మార్ట్ 'సృష్టించి, వారిని వ్యాపారులుగా మార్చడం, విద్య, వైద్యం, సాగు తాగునీటి సౌకర్యాల కల్పనలో విప్లవాత్మక మార్పులు చేశారు. ఆదివాసీ జేఏసీ ద్వారా 'ఆదివాసి వికాస రత్న"బిరుదు పొందారు...



**జనగణమన బ్యూరో ,హైదరాబాద్:**
**తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.**

# భద్రగిరి మార్ట్ గిరిజన నిరుద్యోగ ఆదివాసీలకు ఒక వరం

## ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ కి అభినందనలు తెలుపుతున్న అధికారులు..





**జనగణమన బ్యూరో భద్రాచలం, .**

భద్రాచలం పట్టణ ప్రజలకు అడవులలో దొరికే అటవీ ఉత్పత్తులు, సేంద్రియ ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్ హెచ్ జి మరియు గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఎంతో దూర దృష్టితో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ కృషితో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ చాలా అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా పిఓ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్ ను మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మరియు ఇతర అధికారులతో కలిసి ఆయన సందర్శించి మార్ట్ లోని అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్ లో అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఎస్ హెచ్ జి గిరిజన మహిళలు మరియు ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ను కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్టును స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, భద్రగిరి మార్ట్ లో అందుబాటులో ఉంచిన గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడం, అలాగే వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, భద్రాచలం ప్రజలు గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసి, గిరిజన ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళలు, గిరిజన రైతులకు ఆర్థికంగా చేయూత అందించాలని ఆయన అన్నారు. అనంతరం భద్రగిరి మార్ట్ ఆవరణలో మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ మహామారి నిర్మూలన సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ ఐటీడీఏ యూనిట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**జనగణమన బ్యూరో :సింగరేణి**

కారేపల్లి మండలం అప్పాయిగూడెంకు చెందిన వట్టం సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అనుచరుడు, బీఆరఎస్ మాజీ కార్యదర్శి అజ్మీర వీరన్న పరామర్శించి కొంత ఆర్థిక సాయాన్ని అందించారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవటం విచారకరమని జర్నలిస్టుగా బాధలు తెలిసిన వ్యక్తిగా బాధిత కుటుంబాలకు సాయం చేస్తున్నట్లు వీరన్న తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు ఈసం విష్ణు, సూర్యం, రాంమ్మూర్తి, రామారావు, నాగేంద్రబాబు, వాంకుడోత్ విజయ్, భూక్యా రాంకీ తదితరులు పాల్గొన్నారు.

# L2,L3 జాబితాల గల అర్హులను L1కి చేర్చాలి.

**జనగణమన బ్యూరో సింగరేణి**

నియోజకవర్గంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో నిర్వహించారు. ఈ సమావేశంలో సింగరేణి (కారేపల్లి) సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ ఇందిరమ్మ రెండవ జాబితా ఎంపికలో ఎల్ వన్ జాబితాలో ఉన్న వాళ్లకి మాత్రమే ఎంపిక చేయాలని, ఎా1,ఎా2,ఎా3 లీస్టులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి వివరించారు. ఎల్ టు, ఎల్ త్రీ లో ఉన్న అర్హులను గుర్తించి రేస్ సర్వే చేయించి ఎలివాన్లోకి చేర్చాలని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరారు. ఈ విషయాలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి అధికారులకు ఆదేశించారు

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక సమీక్ష సమావేశం

## 384 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**జనగణమన బ్యూరో కీసర**

మేడ్చల్ నియోజకవర్గ స్థాయిలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికపై సమీక్ష సమావేశం కీసర మండలం బోగారం రోడ్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి కీసర ఆర్డీవో రాజేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 7 మండలాలకు చెందిన తహసీల్దార్లు, ప్రజలు మరియు వివిధ పథకాల లబ్ధిదారులు సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 384 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కులు పంపిణీ చేశారు. అలాగే వ్యవసాయ, విద్యుత్, సివిల్ సప్లయ్, హౌసింగ్ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డి, ప్రజాప్రతినిధులు వజ్రేశ్ యాదవ్, సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరసింహులు యాదవ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఆర్టీఏ సభ్యుడు జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి శిరీషతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం

**"మాదక ద్రవ్యాలకు 'నో' -- ఆరోగ్యకర భవిష్యత్తుకు 'అవును'" పిలుపు**







**జనగణమన బ్యూరో జవహర్ నగర్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో ప్రజా ప్రభుత్వం కార్యక్రమం, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్‌లోని ఆర్మీ డెంటల్ కాలేజ్ ప్రాంగణంలో మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, "మాదక ద్రవ్యాలకు 'నో' చెప్పండి -- ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు 'అవును' చెప్పండి" అని పిలుపునిచ్చారు. తెలంగాణలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్ బ్యూరో కీలక చర్యలు తీసుకుంటోందన్నారు. మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో సింథటిక్ డ్రగ్స్ వ్యాప్తిపై ప్రత్యేక నిఘా ఉంచి, తయారీ, రవాణా ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ఏడాదిలో గుప్త డ్రగ్స్ ఫ్యాక్టరీలను గుర్తించి మూసివేయడంతో పాటు ఎఫీడ్రిన్, మెథాఫెటమిన్ వంటి పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, తెలంగాణ పోలీసుల సంయుక్త చర్యలతో అంతర్రాష్ట్ర గంజాయి రాకెట్లను కూడా అరికడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ తయారీలో ఉపయోగించే రసాయనాల అక్రమ ఉత్పత్తిపై ఫార్మా సంస్థలపై చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి చికిత్సతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్కూల్, కాలేజీలలో డ్రగ్స్ నిరోధక కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నామని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు సరిత, చందన మాట్లాడుతూ, సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే డ్రగ్స్ రహిత వాతావరణం సాధ్యమవుతుందని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై సమాచారం ఉంటే 1903 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మోతి, జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్, అదనపు డీసీపీ నరసింహ రెడ్డి, నార్కోటిక్ విభాగం అదనపు ఎస్పీ రమేష్, డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ తదితరులు మాట్లాడుతూ యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచాలని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, విద్యాశాఖ అధికారి హేమలత, ఎక్సైజ్, పోలీస్, ఐసిడిఎస్ శాఖల అధికారులు, అంగన్వాడీ యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# బృందావన్ గార్డెన్స్‌లో ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక సమీక్ష

**99 రోజుల కార్యాచరణపై శాఖల వారీగా స్పష్టమైన ఆదేశాలు**







**జనగణమన బ్యూరో ,మల్కాజ్గిరి**

మల్కాజిగిరి పరిధిలోని బృందావన్ గార్డెన్స్‌లో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరై సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రణాళిక అమలు పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు చేరువగా సేవలు అందించేందుకు ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఉత్తర్వులు జి.ఓ. నం. 3 ప్రకారం నియోజకవర్గాల వారీగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జనాభా లెక్కల నమోదు, ఎస్ఐఆర్‌లో ఓటర్ నమోదు ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ శాఖలో ధరణి పెండింగ్ దరఖాస్తులు, మ్యుటేషన్లు, పట్టాదారు పాసు పుస్తకాల జారీని శాతం పూర్తిచేయాలని, భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ శాఖ పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజ్ నిర్వహణపై రోజువారీ పర్యవేక్షణతో పాటు వార్డు వారీగా శానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.సివిల్ సప్లైస్ శాఖలో కొత్త రేషన్ కార్డులు, ఆధార్ సీడింగ్, ఈ-కేవైసీ ప్రక్రియలు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని, వచ్చిన దరఖాస్తులను 7 రోజుల్లో పరిష్కరించాలని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీలలో మందుల లభ్యత, వైద్యుల హాజరు నిర్ధారించడంతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.గృహ నిర్మాణ శాఖ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు, స్థల పరిశీలనను వేగవంతం చేయాలని, మంజూరైన ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం సరఫరాను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.విద్యుత్ శాఖలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల నమోదు పూర్తి చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేసి విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రజా పాలన దరఖాస్తుల్లోని శాంతిభద్రతల సమస్యలను పరిష్కరించడంతో పాటు డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి విభాగం తమకు కేటాయించిన పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించాలని, ఆలస్యం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ రాణి, మల్కాజిగిరి తహసీల్దార్ సీతారాం, ఆల్వాల్ తహసీల్దార్ రాములు, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఎంఈఓలు మురళీ కృష్ణ, మనోహర్, అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ సంధ్యతో పాటు వైద్య ఆరోగ్య, రవాణా, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈసీఐఎల్‌లో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు

**జనగణమన బ్యూరో కుషాయిగూడ,**

ఈసీఐఎల్ లోని ఎస్సి, ఎస్టి ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీకాంత్ తెలిపారు. మే 4 నుంచి 31 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ తరగతులు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ రోడ్డులో, ఎస్‌బీఐ బ్యాంకు పక్కన ఉన్న అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌లో(డా. బి .ఆర్. అంబేద్కర్ లైబ్రరీ భవన్ )నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత తరగతులకు విద్యార్థులు, యువత, ఉద్యోగులు, మహిళలు హాజరుకావచ్చని తెలిపారు. ఇంగ్లీష్ మాట్లాడే నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.మరిన్ని వివరాల కోసం 7842419367, 9951754975, 9866540816 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రజలకు చెప్పని కొత్త పథకాలూ అమలు చేస్తున్న ప్రభుత్వం

**ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**జనగణమన బ్యూరో /నల్లగొండ**

నల్గొండ, మే 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా, చెప్పని అనేక కొత్త పథకాలను కూడా అమలు చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు గ్రామ, మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500కే ఎల్పీజీ గ్యాస్ వంటి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెప్పారు.అదేవిధంగా, దేశంలో ఎక్కడా లేనివిధంగా పూర్వ ప్రాథమిక విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం రాజి జావ, సాయంత్రం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు.ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, ఈ పథకం కోసం సంవత్సరానికి రూ.1400 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.ఉచిత బస్సు పథకం కింద 2.86 కోట్ల మహిళలు ప్రయాణించారని, ఉచిత విద్యుత్ పథకం కింద రూ.5000 కోట్లు ప్రభుత్వం చెల్లించినట్లు పేర్కొన్నారు.నల్గొండ పట్టణంలో రామగిరి టెంపుల్ నుంచి దేవరకొండ రోడ్డు వరకు రూ.15 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

# నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**నల్గొండలో మెగా జాబ్ మేళాను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**జనగణమన బ్యూరో/ నల్లగొండ:**

నల్గొండ, మే :నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (న్యాక్)లో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య అతిపెద్ద సమస్యగా మారిందని, తెలంగాణ ప్రభుత్వం చదివిన చదువుకు తగిన ఉద్యోగాలు కల్పించే దిశగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కింద మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.నల్గొండలో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళా ద్వారా కనీసం 5000 మందికి ఉద్యోగాలు కల్పించాలని కంపెనీలను కోరారు. యువత అధిక సంఖ్యలో పాల్గొంటున్న నేపథ్యంలో ఆదివారం కూడా మేళాను కొనసాగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.జిల్లాలో సిమెంట్, రైస్, ఫార్మా వంటి పరిశ్రమలు అధికంగా ఉన్నందున స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం సంస్థల బాధ్యత అని పేర్కొన్నారు. యువత ఏ ఉద్యోగం వచ్చినా ముందుగా చేరి, తరువాత ఉన్నత ఉద్యోగాల కోసం సిద్ధమవ్వాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ పథకాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 18,400 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు గుర్తు చేశారు.న్యాక్ సంస్థ ద్వారా అనేక వృత్తుల్లో శిక్షణ ఇచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే పట్టణంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని చెప్పారు.రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫార్మా కంపెనీలలో జరిగిన ప్రమాదాలపై స్పందిస్తూ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 124 కంపెనీలు పాల్గొని ఐటీ, బ్యాంకింగ్, కంప్యూటర్, బిజినెస్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి మారుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ డైరెక్టర్ రాజేందర్ రెడ్డి, ఇంచార్జ్ కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అష్రాఫ్ జూకురి రమేష్, క్రీడలు-న్యాక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత.

**సెయింట్ మేరీస్ హై స్కూల్ ప్రతిభ.**

**జనగణమన బ్యూరో ,బంగారుపాలెం**

.:బంగారుపాలెం మండలంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటుకుంది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధా నోపా ధ్యాయురాలు ఎన్సిల్ల వెల్లడించారు. మొత్తం 96 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరిలో 500కి పైగా మార్కులు సాధించిన వారు 52 మంది ఉన్నారని పేర్కొన్నారు. మండల స్థాయిలో రుతిక రెండో స్థానం, తన్మై మూడో స్థానం సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా



ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయుల బృందం కృషిని కూడా ఆమె అభినందించారు. ఆమె మాట్లాడుతూ, జీవితంలో అనేక పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. మనుషులకు అత్యంత విలువైన సంపద విద్యేనని, ఆ విద్యతో ఎలాంటి కష్టాన్నైనా జయించవచ్చని పేర్కొన్నారు. తరువాత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు.

# పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని, వారి ప్రవర్తనను సమీక్షిస్తూ సరికొత్త సవాళ్ల నుంచి రక్షించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి









**జనగణమన బ్యూరో ,రంగారెడ్డి**

శనివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ లోని రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ప్రారంభించి, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సభలో ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్ లు ముఖ్య అతిధులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు అతుక్కుపోకుండా నియంత్రిస్తూ, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 14 సంవత్సరాలు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణలో భాగంగా హెచ్ పివి (హ్పూ) టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ టీకా సురక్షితమై, దీర్ఘకాలిక రక్షణను అందిస్తుందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తూ సహకరిస్తోందని,

మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. కుటీర పరిశ్రమల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం సైబర్ క్రైమ్‌లు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కిరణ్మయి హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, ఓటీపీలు పంచుకోవద్దని, మోసపోయినట్లయితే వెంటనే 1930 లేదా 1908 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారుదారులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని,

మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా వ్యవస్థలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. మహిళల సంక్షేమానికి ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, తక్కువ ధరలో గ్యాస్ సిలిండర్, రైతులకు రైతు భరోసా, పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు రూ.238 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ మున్సిపల్ కమిషనర్ సునీత, మండల విద్యాధికారి మనోహర్, ఫరూక్ నగర్ మండల తాహసిల్దార్ నాగయ్య ఎంపీడీవో బన్సీలాల్ అధికారులు వివిధ

# ఉప్పల్‌లో 99 రోజుల కార్యాచరణపై సమీక్ష సమావేశం

## ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దు: ఎమ్మెల్యే







**జనగణమన బ్యూరో ఉప్పల్**

ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే హాజరై సంబంధిత శాఖల అధికారులతో కలిసి అమలు పరిస్థితిని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు చేరువగా సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజ్ వంటి కీలక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో జెడిసిం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సమగ్ర సమావేశం

## సంక్షేమ పథకాలపై అవగాహన -- అధికారుల సమగ్ర వివరణ

**జనగణమన బ్యూరో కూకట్పల్లి**



కూకట్‌పల్లి నియోజకవర్గ స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సమగ్ర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, కూకట్‌పల్లి మండల ప్రత్యేక అధికారి జి. వినోద్ కుమార్, జిల్లా విద్యాధికారి విజయ కుమారి, ఉప కమిషనర్‌తో పాటు బాలానగర్, కూకట్‌పల్లి తహసీల్దార్లు, మండల విద్య అధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సహా వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. సమావేశంలో అధికారులు తమ తమ శాఖల ద్వారా అమలు అవుతున్న సంక్షేమ పథకాలపై సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా విదేశీ విద్యకు ఆర్థిక సహాయం, ప్రీ–పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌ల ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ నిర్మాణ సహాయం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక సహాయం, కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా వివాహ సహాయం వంటి పథకాల వివరాలు ప్రజలకు తెలియజేశారు. ప్రతి శాఖ అధికారి తమ విభాగ పరిధిలో అమలవుతున్న కార్యక్రమాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలు, ఎదురయ్యే సమస్యలు వాటి పరిష్కారాలపై వివరించారు. ప్రజలు వ్యక్తపరిచిన సందేహాలకు అధికారులు సమగ్రంగా స్పందించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో సమన్వయం, పారదర్శకతతో పనిచేసి ప్రతి అర్హుడికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.



# మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతన జిల్లా & సెషన్ కోర్టు హాల్ ప్రారంభం

## న్యాయసేవల వేగవంతానికి ఆధునిక వసతులు







**జనగణమన బ్యూరో మేడ్చల్**

నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన జిల్లా మరియు సెషన్ కోర్టు హాల్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా ఉన్నతాధికారులు హాజరయ్యారు. నూతన కోర్టు హాల్‌ను జస్టిస్ కె. లక్ష్మణ్ (హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి), జస్టిస్ బి. విజయ్ సేన్ రెడ్డి, జస్టిస్ నందికొండ నర్సింగరావు కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మను చౌదరి సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం న్యాయమూర్తులు నూతన కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, న్యాయమూర్తుల ఛాంబర్లు, ఇతర వసతులను పరిశీలించారు. పెరుగుతున్న కేసుల దృష్ట్యా కక్షిదారులు, న్యాయవాదులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం, న్యాయ ప్రక్రియను వేగవంతం చేయడం లక్ష్యంగా ఈ కోర్టు హాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధి కారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధి కారు లు, కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్గొండలో గంజాయి గ్యాంగ్ అరెస్ట్

## 5 కిలోల గంజాయి స్వాధీనం -- 5 మంది అదుపులో, మరికొందరు పరారీలో

**జనగణమన బ్యూరో /నల్లగొండ:**

:నల్గొండ, మే ఆంధ్ర--ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి నల్గొండకు గంజాయి సరఫరా చేస్తున్న గ్యాంగ్‌ను టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు నిర్వహించిన సడెన్ రైడ్‌లో ఐదుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.3 లక్షల విలువ చేసే 5 కిలోల గంజాయి, రెండు పల్సర్ బైకులు, ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకులు స్థానికంగా ఉన్న ఉడిపి హోటల్ సమీపంలో గుట్టుగా డీల్ చేస్తుండగా పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు. పోలీసులను గమనించిన నిందితులు అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించినప్పటికీ, సిబ్బంది వెంటనే స్పందించి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, గంజాయిని ఒక్క కేజీని రూ.3 వేలకే కొనుగోలు చేసి నల్గొండలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. స్నేహితులుగా ప్రారంభమైన ఈ గ్యాంగ్, తర్వాత గంజాయి వ్యాపారంగా మారినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఆరుగురు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం




గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ జి. రమేష్ మాట్లాడుతూ, గంజాయి వ్యాపారంలో పాల్గొనే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "గంజాయి అంటే జైలు టికెట్ ఖాయం" అని ఆయన స్పష్టం చేశారు.

# నల్గొండలో ఫాగింగ్ కార్యక్రమం

## ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు

**జనగణమన బ్యూరో ,నల్గొండ**

పట్టణంలో దోమల నివారణ మరియు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ నంబర్లు 03, 15, 23 మరియు 45 పరిధిలో ఫాగింగ్ నిర్వహిఁచాంు. ప్రస్తుతం వేసవి కాలం నేపథ్యంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మరింత విస్తృతంగా ఫాగింగ్ చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్ సమీక్ష నిర్వహించగా, ప్రజల నుంచి సహకారం అందించాలని కోరారు.






# మహేష్ కు తదుపరి ఎంపిక పెద్ద టాస్కే!



ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ అడ్వెంచర్ థ్రిల్లర్ –వారణాసి– లో నటిస్తున్నారు. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ అడ్వెంచర్ థ్రిల్లర్ –వారణాసి– లో నటిస్తున్నారు. ఈ సినిమాతో మహేష్ పాన్ ఇండియాను దాటి గ్లోబల్ స్థాయి ఇమేజ్ ను సొఓంతం చేసుకుంటాడు. దీంతో మహేష్ తదుపరి ఏ దర్శకుడితో సినిమా చేసినా? అంతకు మించే ఉండాలి తప్ప తగ్గడానికి వీలులేదు. ఈనేపథ్యంలో మహేష్ చేసే ప్రాజెక్ట్ ఎవరితో ఉంటుంది? అనే చర్చ టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ రేసులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు –యానిమల్– ఫేమ్ సందీప్ రెడ్డి వంగా. సందీప్ మేకింగ్ స్టైల్ , హీరోలను ప్రెజెంట్ చేసే తీరు మహేష్‌కు ఎంతో లైక్ చేస్తారు. కానీ ఆయన చిత్రాల్లో ఉండే తీవ్రత , వివాదాస్పద పాత్రల విషయంలో మహేష్ కొంత జాగ్రత్తగా ఉఒంటారు. గతంలోనే వీరిద్దరి మధ్య చర్చలు జరిగినప్పటికీ కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఒకవేళ సందీప్ వంగా మహేష్ ఇమేజ్‌కు తగ్గట్లుగా పవర్‌ఫుల్ అండ్ క్లాస్ కథను సిద్ధం చేస్తే తప్ప ఈ కాంబినేషన్ పట్టాలెక్కడం అంత సులభం కాదు. అలాగే –ఉప్పెన–తో సంచలనం సృష్టించిన బుచ్చిబాబు పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం బుచ్చి రామ్ చరణ్‌తో –పెద్ది– తెరకెక్కిస్తోన్న సంగతి తెలి సిందే. బుచ్చిబాబు వద్ద అద్భుతమైన పీరియాడిక్ కథ ఉందని అది మహేష్‌కు బాగా నచ్చిందని సమాచారం. బుచ్చిబాబు మేకింగ్‌లో ఉండే సహజత్వం మహేష్ కు ఓ కొత్త డైమెన్షన్‌ను ఇస్తుందని అభిమానులు భావిస్తున్నారు. రాజమౌళి సినిమా తర్వాత ఒక రిఫ్రెషింగ్ కథతో రావాలనుకుంటే బుచ్చిబాబు సరైన ఎంపిక అయ్యే అవకాశం ఉంది. వీరితో పాటు బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ పేరు కూడా రేసులో వినిపిస్తుండటం విశేషం. –ఉరి ద సర్జికల్ స్ట్రైక్–, –ధురంధర్– చిత్రాలతో సత్తా చాటిన ఆదిత్య ధర్ మహేష్ తో ఓ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను ప్లాన్ చేస్తున్నట్లు టాక్. వారణాసి తర్వాత మహేష్‌కు పాన్ ఇండియా లెవల్‌లో విపరీతమైన క్రేజ్ వస్తుంది కాబట్టి బాలీవుడ్ దర్శకుడితో సినిమా చేయడం మార్కెట్ పరంగా కలిసొచ్చే అంశం. ఆదిత్య ధర్ టేకింగ్ ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో ఉండటం మహేష్‌ను ఆకర్షిస్తున్నట్లు సమాచారం. అయితే మహేష్ కంఫర్ట్ జోన్ అంత సులభంగా దాటి రారు. కథలోని బలాన్ని చూస్తారు. రాజమౌళి వంటి దిగ్గజ దర్శకుడితో పని చేసిన తర్వాత ఆ ఇంపాక్ట్ తగ్గకుండా ఉండాలంటే ఎంపిక చేసుకోబోయే దర్శకుడు మేకింగ్ పరంగా రాజీ పడకూడదు. పైన పేర్కొన్న ముగ్గురిలో ఒకరు ఫైనల్ అవుతారా? లేక మరో డైరెక్టర్ ఎవరైనా రంగంలోకి దిగుతారా? అన్నది ప్రస్తుతానికి సస్పెన్సే. మహేష్ నిర్ణయం మాత్రం బాక్సాఫీస్ సమీకరణాలను పూర్తిగా మార్చగలదు. అందులో ఎలాంటి సందేహం లేదు.

# దేవర 2'.. ఇది మ్యాటర్!



టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్లో ఇప్పుడు దేవర 2పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల్లో ఇప్పుడు దేవర 2పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ పార్ట్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడంతో, సీక్వెల్ పై అంచనాలు మరింత పెరిగాయి. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఇప్పటికే రూ. 1000 కోట్ల బొమ్మ అంటూ ట్రెండ్ చేస్తున్నారు. అయితే నిజంగా ఆ రేంజ్ సాధ్యమేనా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఎన్టీఆర్.. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న డ్రాగన్ షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన వెంటనే ఆయన ఫ్రీ అవుతారని సమాచారం. అదే సమయంలో దర్శకుడు కొరటాల శివ కూడా నందమూరి బాలకృష్ణతో చేయనున్న బీదీఖ112 ప్రాజెక్టు పూర్తి చేస్తారు. ఆ రెండు సినిమాలు ముగిసిన తర్వాతే దేవర 2 సెట్స్ పైకి వెళ్ళే అవకాశం ఉందని తెలుస్తోంది. పాన్ ఇండియా రేంజ్ లో భారీ విజయం సాధించిన ఆర్ఆర్ఆర్ తర్వాత ఎన్టీఆర్ నుంచి వచ్చిన సినిమా దేవర. దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన ఆ చిత్రం, రాజమౌళి సెంటిమెంట్ ను బ్రేక్ చేస్తూ మంచి వసూళ్లు సాధించింది. సాధారణంగా జక్కన్న సినిమా తర్వాత హీరోలకు వెంటనే హిట్ రావడం కష్టమనే అభిప్రాయం ఉంది. కానీ దేవర ఆ ట్రెండ్ ను చెరిపేసింది. సుమారు రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఎన్టీఆర్ కెరీర్ లో సోలో హీరోగా అతిపెద్ద హిట్ గా నిలిచిందిఇప్పుడు ఆ విజయానికి సీక్వెల్ గా వస్తున్న దేవర 2 మూవీపై అంచనాలు నేచురల్ గానే పెరిగాయి. ముఖ్యంగా కథలో పెద్ద మార్పులు చేసినట్లు సమాచారం. ప్రీ–ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, షూటింగ్ షెడ్యూల్ కూడా సిద్ధమైందని తెలుస్తోంది. హీరోయిన్ గా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తుండగా, విలన్ పాత్రలో బీటౌన్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ కనిపించనున్నారు. మరోవైపు, ఎన్టీఆర్ ఇప్పటివరకు సోలోగా రూ. 1000 కోట్ల క్లబ్ లోకి అడుగుపెట్టలేదు. ఆర్ఆర్ఆర్ తో మాత్రం రామ్ చరణ్ తో కలిసి ఆ రికార్డును అందుకున్నారు. దీంతో అభిమానులు డ్రాగన్, దేవర 2 ద్వారా తారక్ ఆ ఘనతను సొంతం చేసుకోవాలని ఆశిస్తున్నారు. అయితే రూ. 1000 కోట్ల మార్క్ చేరుకోవాలంటే కేవలం స్టార్ పవర్ సరిపోదని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. సినిమాలోని కథ, కంటెంట్, పాన్ ఇండియా రీచ్, మార్కెటింగ్ సహా అన్ని ఫ్యాక్టర్స్ కీలకం.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో, మంచి కథతో పాటు భారీ విజువల్ ట్రీట్ ఇస్తే దేవర 2 ఆ రేంజ్ ను టచ్ చేసే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. మొత్తానికి దేవర 2పై ఆడియన్స్ లో హైప్ మాత్రం భారీగానే ఉంది. కానీ ఆ హైప్ ను కలెక్షన్లుగా మార్చగలిగితేనే ఇది నిజమైన రూ. 1000 కోట్ల బొమ్మగా నిలుస్తుంది. మరి తారక్ ఫ్యాన్స్ ఆశలు ఎంతవరకు నెరవేరుతాయో చూడాలి.

# 'లెనిన్' కు పెద్ద రిలీఫ్ ఇచ్చిన 'పెద్ది'..!







అఖిల్ అక్కినేని నటించిన 'ఏజెంట్' చిత్రం తర్వాత సుమారు మూడేళ్ల నిరీక్షణకు తెరదించుతూ 'లెనిన్' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. ఇటీవల అక్కినేని నాగార్జున ఈ చిత్రం గురించి పాజిటివ్ గా స్పందించడం అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

సినిమా విడుదల తేదీపై నెలకొన్న సందిగ్ధత కూడా ఇప్పుడు తొలిగిపోయింది.

'పెద్ది' చిత్ర బృందం తమ సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో, 'లెనిన్' జూన్ 26న సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు రెడీ అయింది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం అఖిల్ కెరీర్‌కు ఈ సమయంలో పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ మరియు అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మించాయి.

భాగ్యశ్రీ బోర్సే గ్లామర్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాగా, థమన్ అందించిన సంగీతం అప్పుడే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరి లెనిన్ సినిమాతో అఖిల్ ఈసారి ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.

# కవర్ పేజీపై సారా అర్జున్ మైండ్ బ్లోయింగ్ ఫోజులు











సారా అర్జున్.. ఈ పేరు వినగానే మనకు –నాన్న– (దైవ తిరుమగళ్) చిత్రంలో విక్రమ్ కుమార్తెగా నటించిన ఆ చిన్నారి గుర్తుకు వస్తుంది.సారా అర్జున్.. ఈ పేరు వినగానే మనకు –నాన్న– (దైవ తిరుమగళ్) చిత్రంలో విక్రమ్ కుమార్తెగా నటించిన ఆ చిన్నారి గుర్తుకు వస్తుంది. కానీ ఇప్పుడు ఆ చిన్నారి 20 వయసు డ్రీమ్ గాళ్ గా ఎదిగింది. భారతీయ చిత్ర పరిశ్రమలో –నెక్స్ట్ బిగ్ థింగ్–గా అవతరించింది. తాజాగా –ఎల్లే ఇండియా– డిజిటల్ కవర్ స్టార్‌గా మెరిసిన సారా.. తన కెరీర్– వ్యక్తిగత ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను షేర్ చేసింది. కేవలం అందం మాత్రమే కాకుండా.. నటన లో తనకు ఉన్న పరిణతి ఎల్లే కవర్ స్టోరీ ఇంటర్వ్యూలో స్పష్టంగా రివీలైంది. ప్రస్తుతం –ధురంధర్– ఫ్రాంచైజీతో బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల వసూళ్లను చూసిన సారా ఈ విజయంపై చాలా స్పష్టతతో ఉంది. ప్రస్తుతం తనచుట్టూ జరుగుతున్నవన్నీ చూస్తుంటే చాలా కృతజ్ఞతగా ఉందని.. కానీ ఈ క్షణం విలువను నేను భవిష్యత్తులో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు మాత్రమే పూర్తిగా అర్థం చేసుకోగలనని తెలిపింది. తన దృష్టి అంతా జీవితంలోని తదుపరి అధ్యాయంపైనే ఉందని కూడా సారా పేర్కొన్నారు. సినిమా ఇండస్ట్రీలోనే పెరగడం వల్ల ఇక్కడి గెలుపోటములు.. అనిశ్చితిపై తనకు పూర్తి అవగాహన ఉందని కూడా సారా పేర్కొంది.నటన గురించి సారా చెబుతూ..––కెమెరా ముందుకు వచ్చినప్పుడు నేను సారా అనే వ్యక్తిని పూర్తిగా మర్చిపోతాను. మరొకరి పాత్రను పోషిస్తున్నప్పుడు మనలోని అడ్డంకులు, బిడియం అన్నీ తొలగిపోతాయి.

నాకు నటన అంటే అందరూ నన్ను చూడటం కాదు.. ఆ పాత్రలో నేను లీనమైపోవడం–– అని తన వృత్తి పై ఉన్న కసిని సారా చాటుకుంది. కేవలం 20 ఏళ్ల వయస్సులోనే ఇంతటి స్థిరమైన ఆలోచనా ధోరణి తనను ఉన్నత స్థాయిలో నిలబెడుతుందనడంలో సందేహం లేదు. తాను గ్లామర్ ప్రపంచంలో ఉన్నా నిజాయితీగా ఉండటమే ముఖ్యమని నమ్ముతానని సారా చెబుతోంది. ప్రేక్షకులు ఎప్పుడూ నిజాయితీకి, పర్ఫెక్షన్‌కు మధ్య ఉన్న తేడాను గుర్తించగలరు. అందుకే నేను ఎప్పుడూ నిజాయితీగా ఉండటానికే ప్రయత్నిస్తాను! అని సారా తెలిపారు. ఫ్యాషన్ అండ్ స్టైలింగ్ విషయంలో కూడా సారా తనదైన ముద్ర వేస్తోంది. ఎల్లే కవర్ పేజీపై సారా గ్లామర్ డోస్ దుమారం రేపుతోంది. ముఖ్యంగా సారా కోసం ఎంపిక చేసుకున్న ప్రయోగాత్మక బ్లేజర్లు.. థై సొగసుల్ని ఎలివేట్ చేసే డిజైనర్ దుస్తులు తనలోని గ్లామ్ యాంగిల్ ని మరో లెవల్లో ఆవిష్కరించాయి.

ఎల్లే షూట్ కోసం స్టెల్లా మాక్‌కార్ట్నీ.. ధ్రువ్ కపూర్ వంటి ప్రముఖ డిజైనర్ల దుస్తులలో అద్భుతంగా కనిపించారు. మొత్తానికి చైల్డ్ ఆర్టిస్ట్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టి నేడు వేల కోట్ల వసూళ్లు సాధించిన చిత్రాల్లో నటిగా ఉన్న సారా అర్జున్ భవిష్యత్ లో భారతీయ సినిమాను ఏలబోయే స్టార్ హీరోయిన్‌గా కనిపిస్తోంది. ఈ ప్రతిభావని నటనలోని సహజత్వం.. కెరీర్ జర్నీపై ఉన్న స్పష్టత తనను ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం నిలబెడతాయని చెప్పడంలో సందేహం లేదు.

Printed, Published and Owned by Kothinti Devender Reddy, Published at 14-20-677/482, VVN Nagar, Madhapur, Hyderabad, Telangana State. Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, H.No.11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal-Malkajgiri District -- 500098. Editor : Kothinti Devender Reddy. PRGI REGD NO.TGTEL/26/A1335. Mail ID:janaganamanadaily@gmail.com, Ph:040-29701155